ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల జిల్లా వార్తలు
5★★
శుక్రవారం 28 ఫిబ్రవరి 2025





ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతం

- జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 70.47 శాతం నమోదు
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ 92.43 శాతం
- కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ





మల్లాపూర్‌లో బారులు తీరిన ఓటర్లు



ఓటు హక్కు వినియోగించుకొని సిరాచుక్క చూపుతున్న జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయలక్ష్మి, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, కోరుట్ల కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి నర్సింగరావు



జగిత్యాలలో ఓటు హక్కు వినియోగించుకున్న కలెక్టర్ సత్యప్రసాద్ దంపతులు

పట్టభద్రుల నియోజకవర్గం	ఉపాధ్యాయుల నియోజకవర్గం
ఓటర్లు: 3,55,159	ఓటర్లు: 27,088
ఓటుహక్కు వినియోగించుకున్నవారు: 2,50,106 (70.42 శాతం)	ఓటుహక్కు వినియోగించుకున్నవారు: 24,895 (91.9 శాతం)
పురుషులు: 1,62,561 / మహిళలు: 87,544	పురుషులు: 15,743 / మహిళలు: 9,152

జగిత్యాల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు వేములవాడ నియోజకవర్గం పరిధిలోని కథలాపూర్, మేడిపల్లి, భీమారం మండలాలు, చొప్పదండి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని కొడిమ్యాల, మల్యాల మండలాల్లో ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గానికి జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో 71.51 శాతం పోలింగ్ నమోదైంది. ఇందులో పట్టభద్రుల నియోజక వర్గానికి జరిగిన ఎన్నికలో 70.47 శాతం, ఉపాధ్యాయ నియోజకవర్గానికి జరిగిన ఎన్నికల్లో 92.43 శాతం పోలింగ్ నమోదైంది.

● పట్టభద్రుల ఎన్నికల్లో..

జిల్లాలో పట్టభద్రుల నియోజకవర్గంలో 35,281 మంది మొత్తం ఓటర్లుండగా ఇందులో 21,667 మంది పురుషులు, 13,614 మంది స్త్రీలు ఉన్నారు. ఇందులో మొత్తం 24,859 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా పురుషులు 15,368 మంది, స్త్రీలు 9,441 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లాలో పట్టభద్రుల నియోజకవర్గానికి 51 పోలింగ్ స్టేషన్లను అధికారులు ఏర్పాటు చేశారు.

● ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో..

జిల్లాలో ఉపాధ్యాయ నియోజకవర్గంలో 1,769 మంది మొత్తం ఓటర్లుండగా ఇందులో 1,232 మంది పురుషులు, 537 మంది స్త్రీలున్నారు. మొత్తం 1,635 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా ఇందులో పురుషులు 1,152మంది, స్త్రీలు 483మంది ఉన్నారు. జిల్లాలో ఉపాధ్యాయ నియోజకవర్గానికి 20 పోలింగ్ స్టేషన్లను అధికారులు ఏర్పాటు చేశారు.

● జిల్లాలో పోలింగ్ సరళి ఇలా..

జిల్లాలోని పోలింగ్ స్టేషన్‌లలో ఉదయం మందకొడిగా ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నానికి పుంజు కుంది. జిల్లాలో ఉదయం 7 గంటలకు మాక్ పోలింగ్‌ను అధికారులు, సిబ్బంది జరిపారు. అనంతరం ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రక్రి యను ప్రారంభించారు. ఉదయం 10 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా 6.58 శాతం పోలింగ్ నమో దు కాగా ఇందులో ఉపాధ్యాయ నియోజకవర్గంలో 9.67శాతం, పట్టభద్రుల నియోజకవర్గంలో 6.43 శాతం నమోదైంది. మధ్యాహ్నం 12 గంటలకు 21 శాతం నమోదు కాగా ఉపాధ్యాయ నియోజకవర్గంలో 39.12శాతం, పట్టభద్రుల నియోజక వర్గంలో 20.10శాతం నమోదైంది. 2 గంటలకు 42.46శాతం నమోదు కాగా ఉపాధ్యాయ నియోజకవర్గంలో 63.65శాతం, పట్టభద్రుల నియోజకవర్గంలో 41.39 శాతం నమోదైంది. సాయంత్రం 4గంటల వరకు 71.51శాతం నమోదు కాగా ఉపాధ్యాయ నియోజకవర్గంలో 92.43 శాతం, పట్టభద్రుల నియోజకవర్గంలో 70.46 శాతం నమోదైంది.

● పట్టభద్రుల ఎన్నికల్లో మేడిపల్లిలో అధికం

జిల్లాలో పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ స్థానానికి గురువారం జరిగిన ఎన్నికల్లో అత్యధికంగా మేడిపల్లిలో పోలింగ్ నమోదు కాగా గొల్లపల్లిలో అత్యల్పంగా నమోదైంది. జిల్లాలోని మేడిపల్లిలోని జడ్పీహెచ్ ఎస్ పోలింగ్ స్టేషన్‌లో 80.32శాతం పోలింగ్ నమోదైంది. ఈ పోలింగ్ స్టేషన్‌లో 752మంది ఓటర్లుండగా 604మంది ఓటర్లు తమఓటు హక్కును వినియో గించుకొని భారీ పోలింగ్‌ను నమోదు చేశారు. సారంగపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో 528మంది ఓటర్లకు గానూ 419 మంది ఓటు హక్కును వినియోగించుకోగా 79.36 శాతం పోలింగ్ నమోదైంది. జిల్లాలోని గొల్లపల్లిలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో అత్యల్పంగా 64.39 శాతం పోలింగ్ నమోదైంది. ఈ కేంద్రంలో 660 మంది ఓటర్లుండగా 425 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జగిత్యాల అర్బన్‌లోని ఎస్‌కే ఎన్‌ఆర్ బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో 735 మంది ఓటర్లకు గానూ 478 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా 64.76 శాతం పోలింగ్ నమోదైంది.

● పటిష్ట భద్రత

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురాతన, ఎస్‌కేఎన్‌ఆర్ కళాశాలల్లో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణను ఎస్పీ అశోక్‌కుమార్ పరిశీలించి పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఎలాంటి అవాం ఛనీయ సంఘటనలు జరుగకుండా ఇద్దరు డీఎస్పీలు, ఆరుగురు సీఐలతో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, ఎస్సైలతో 18 పెట్రోలింగ్ టీమ్స్ ఏర్పాటు చేయగా ఎస్పీ అశోక్ కుమార్ బందోబస్తుతో పాటు పోలింగ్ సరళిని పరిశీలించారు. జగిత్యాల డీఎస్పీ రఘచందర్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎస్‌బీ ఇన్స్‌పెక్టర్ ఆరీఫ్‌అలీ ఖాన్, టౌన్ ఇన్స్‌పెక్టర్ వేణు గోపాల్, రూరల్ సీఐ కృష్ణా రెడ్డి ఉన్నారు.

● పలు చోట్ల ఓటర్లకు ప్రలోభాలు

పోలింగ్ రోజు పలు ప్రాంతాల్లో ఓటర్లకు డబ్బు, మద్యం జోరుగా పం పిణీ చేసినట్లు ప్రచారం జరుగు తోం ది. జిల్లాలో ఓటర్లను ఆకట్టు కునేందు కు పలువురు అభ్యర్థులు తమ వం తు చివరి ప్రయత్నం చేశారు. పోలింగ్ రోజు కొన్ని గ్రామాల్లో ఓటర్ల ను ఆకట్టుకునేందుకు మద్యం, డబ్బు లు పంపిణీ చేసినట్లు ప్రచారం జరిగింది.



ఓటు వేస్తున్న కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్

● ఉపాధ్యాయ ఎన్నికల్లో 12 కేంద్రాల్లో వంద శాతం పోలింగ్

జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి గురువారం జరిగిన ఎన్నికల్లో 12 పోలింగ్ స్టేషన్‌లలో వంద శాతం పోలింగ్ నమోదైంది. జిల్లాలోని రాయికల్ జడ్పీహెచ్‌ఎస్ కేంద్రంలో 66 మంది, సారంగపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 11 మంది, బుగ్గారం జడ్పీహెచ్‌ఎస్ రూమ్ నంబరు 2 కేంద్రంలో 13 మంది, గొల్లపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో 12 మంది, ఎండపల్లి జడ్పీహెచ్‌ఎస్ రూమ్ నంబరు 2లో 21 మంది, కొడిమ్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో 35 మంది, భీమారం జడ్పీహెచ్‌ఎస్‌లో 9 మంది, మల్లాపూర్ జడ్పీహెచ్‌ఎస్ 6వ తరగతి రూమ్ కేంద్రంలో 19 మంది ఉపాధ్యాయ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకొని వంద శాతం పోలింగ్ నమోదు చేశారు. కాగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అత్యల్పంగా వెల్గటూరులో 66.67 శాతం పోలింగ్ నమోదైంది. ఇక్కడ 9 మంది ఓటర్లుండగా 6 గురు ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదేవిదంగా జగిత్యాల అర్బన్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (పురాతన) పోలింగ్ కేంద్రంలో 677 మంది ఓటర్లకుగా నూ 609 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోగా 89.96 శాతం పోలింగ్ నమోదైంది.



వెల్గటూర్‌లో మొదటిసారి ఓటు వేసిన ఆనందంలో యువతులు

● ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో మహిళలు పోలింగ్‌పై ఆసక్తి కనబరిచారు. ఉత్సాహంగా మహిళలు పోలింగ్‌లో పాల్గొనడం కనిపించింది. విద్యార్థులు, యువతులు ఎక్కువగా పోలింగ్‌లో పాల్గొన్నారు. ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్దకు మహిళలు చేరుకుని ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లాలో పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 13,614 మంది మహిళా ఓటర్లుండగా 9,493 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉపాధ్యాయ ఎమ్మె ల్సీ ఎన్నికల్లో 537 మంది మహిళా ఓటర్లుండగా 483 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

● పలు ఆలయాల్లో రథోత్సవాలు, శివపార్వతుల కల్యాణం

ధర్మపురి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండ లంలోని నేరెళ్ల గ్రామంలోని శ్రీ సాంబశివుడి ఆలయంలో రథోత్సవం నిర్వహించారు. గురువారం ప్రభుత్వవిప్ లక్ష్మణ్ కుమార్ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆల యం అర్చకులు పర్వతగిరి ప్రశాంత్ స్వామివారి తీర్థ, ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ఆలయ కమిటీ చైర్మన్ కాసారపు రాజాగౌడ్, వైస్ చైర్మన్ జాజాల రమేష్ పాల్గొన్నారు.

ముక్తేశ్వర స్వామి రథోత్సవం

వెల్గటూర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్తునూర్ శ్రీ ముక్తేశ్వర స్వామి రథోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. చిన్నారులు, యువతీ యువకు లు స్వయంగా స్వామి రథోత్సవాన్ని లాగి భక్తిబావం చాటుకున్నారు.

● గొల్లపల్లి: మండలంలోని రాపల్లె శ్రీ రాజరాజేశ్వర దేవస్థానం, లొత్తునూర్‌లోని శ్రీ రాజరాజేశ్వర దేవాయంలో గురువారం స్వామివారి రథోత్సవ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ కమీటీల సభ్యులు, తాజామాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, యువత, మహిళలు పాల్గొన్నారు.

● మల్లాపూర్: వేంపల్లి, మల్లాపూర్‌లో స్వామి రథోత్సవ ములో భక్తులు నిర్వహించారు. మొగిలిపేటలో కోటిలిం గేశ్వరాలయంలో జరిగిన వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శివపార్వతుల కల్యాణం

రాయికల్: రాయికల్ మండలంలోని ధర్మాజీపేట గ్రామంలో గురువారం శివపార్వతుల కల్యాణ ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, నిర్వా హకులు వేముల నర్సయ్య, మమత, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

● కథలాపూర్ : మండలంలోని లొంకరామేశ్వరస్వామి జాతర వైభవోపేతంగా జరిగింది. కొండపై కొలువైన స్వామి వారి దర్శనం కోసం వేలాది మంది భక్తులు ఉదయం నుంచి బారులు తీరారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అర్చకులు మహేశ్వర్ ఎమ్మెల్యేకు పూర్ణకుంభం తో స్వాగతం పలికి శాలువతో సత్కరించారు. బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ స్వామివారిని దర్శించు కున్నారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్‌పర్సన్ పులిశిరీషహరిప్రసాద్, పీసీసీ కార్యవర్గ సభ్యుడు తొట్ల అంజయ్య ఉన్నారు.



నేరెళ్లలో రథోత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ అడ్లూరి

శివపార్వతుల పల్లకీ సేవ

బీర్‌పూర్: బీర్‌పూర్ మండలంలోని తుంగూర్ గ్రామంలో గుట్ట రాజరాజేశ్వర స్వామి జాతర బ్రహ్మోత్సవాలలో గురువారం శివపార్వతుల పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ చైర్మన్ కొల్లూరి ప్రభాకర్, మాజీ సర్పంచ్ గుడిసె శ్రీమతి జితేందర్ యాదవ్, మాజీ ఎంపీటీసీ ఆడెపు మల్లేశ్వరి తిరుపతి, మాజీ ఉపసర్పంచ్‌లు రమేష్, ఆడెపు రవి కుమార్ ఆయా గ్రామా లభక్తులు తదితరులు పాల్గొన్నారు.





ముక్తేశ్వర స్వామికి మంగళ హారతులు ఇస్తున్న మహిళలు..వేంపల్లి శివాలయం వద్ద జరిగిన రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



మృతుడు దేవరాజు

ముస్తాబాద్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు గురువారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. మండల కేంద్రానికి చెందిన ఒల్లెపు దేవరాజు(30) అనే వ్యక్తి వ్యవసాయ బావిలో పూడిక తీత పనులు చేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్థులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. ముస్తాబాద్‌లోని ఓ రైతుకు చెందిన వ్యవసాయ బావిలో దేవరాజు పూడికతీత పనులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. అక్కడున్న వారు వెంటనే అతన్ని స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దేవరాజుకు భార్య లలిత, ఇద్దరు పిల్లలున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ రైతు మృతి



లక్ష్మీనర్సు(ఫైల్)

ముస్తాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నామాపూర్ గ్రామానికి చెందిన అరె లక్ష్మీనర్సు(54) అనే రైతు చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మరణించాడు. గ్రామానికి చెందిన లక్ష్మీనర్సు అనే రైతు కొన్ని రోజుల క్రితం పొలం వద్ద గల ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్ వైర్ పోవడంతో వేద్దామని ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కాడు. ప్రమాదవశాత్తు షాక్ రావడంతో సిద్దిపేటలోని ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. లక్ష్మీనర్సుకు భార్య భూలక్ష్మీ, కొడుకు నవీన్‌లున్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎంపీపీ మంత్రి రాజం విజ్ఞప్తి చేశారు.

కొడుకును కాపాడబోయి తల్లికి గాయాలు..

కోనరావుపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం నాగారంలో కుమారుడు విద్యుదాఘాతానికి గురికావడంతో కాపాడబోయిన తల్లి విద్యుదాఘాతానికి గురైంది. నాగారం గ్రామంలో విద్యుత్ మెయిన్ వైరు తెగి కింద పడిపోగా ఇంటి ముందు ఆడుకుంటూ వెళ్లిన అద్విక్ తీగను పట్టుకున్నాడు. గమనించిన తల్లి సుమ వైరును తొలగించే ప్రయత్నం చేయగా షాక్ తగిలి కింద పడిపోయింది. గ్రామస్థులు వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేసి చికిత్స నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు. అక్కడ తల్లీకొడుకులు చికిత్స పొందుతున్నారు.

హత్యకు గురైన వ్యక్తి గుర్తింపు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణం చంద్రంపేటలోని రాఘవేంద్ర రైస్‌మిల్ వెనుకాల దారుణ హత్యకు గురైన వ్యక్తి సిరిసిల్ల పట్టణానికి చెందిన బూస రమేశ్ (45)గా కుటుంబ సభ్యులు గురువారం గుర్తించారు. టౌన్ సీఐ కృష్ణ వివరాల ప్రకారం.. సంఘటనా స్థలంలో పడిఉన్న వస్తువుల ఆధారంగా ముగ్గురు వ్యక్తులు కలిసి మద్యం సేవించినట్లు ఉంది. మద్యం మత్తులో రమేశ్‌ను తలపై బండరాయితో మోది హత్యచేసినట్లు తెలుస్తోంది. రమేశ్‌పై పలు దొంగతనం కేసులు ఉన్నాయి. జులాయిగా తిరిగే రమేశ్‌ను ఎవరు హత్యచేసి ఉంటారనేది తెలియాల్సి ఉంది. రమేశ్‌కు భార్య లావణ్య, కుమార్తె రచన, కుమారుడు మల్లికార్జున్ ఉన్నారు. పోలీసులు కుటుంబ సభ్యుల స్టేట్‌మెంట్ రికార్డు చేసుకొని మార్చురీలో ఉన్న మృతదేహాన్ని అప్పగించారు. డాగ్ స్క్వాడ్ ఆధారంగా హంతకుల కోసం గాలింపు చేపట్టామని, మరోవైపు సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

అదనపు కట్నం వేధింపులతో భర్తకు జైలు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం భార్యను వేధించిన భర్తకు ఏడాదిన్నర జైలు శిక్షతో పాటు రూ.3వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమశ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ గురువారం తీర్పు వెల్లడించినట్లు ముస్తాబాద్ ఎస్‌ఐ గణేశ్ తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం... సిద్దిపేట మండలంలోని పుల్లూరు గ్రామానికి చెందిన వనమా యాదగిరికి ముస్తాబాద్ గ్రామానికి చెందిన వనమా లక్ష్మీతో 1996 సంవత్సరంలో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొన్నేళ్ల తర్వాత యాదగిరి అదనపు కట్నం తీసుకురావాలని భార్యను వేధింపులకు గురిచేసేవాడు. వేధింపులు భరించలేక 2015 సంవత్సరంలో లక్ష్మి ముస్తాబాద్ పోలీస్‌స్టేషన్‌లో వనమా యాదగిరిపై ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో అప్పటి ఎస్‌ఐ మారుతి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ సందీప్ వాదించగా సీఎంఎస్ ఎస్‌ఐ శ్రావణ్ కోర్టు కానిస్టేబుల్ దేవేందర్ ఐదుగురు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ప్రవీణ్ నిందితునికి ఏడాదిన్నర జైలుశిక్షతో పాటు రూ. 3వేల జరిమానా విధించారని తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

సుల్తానాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): గతేడాది డిసెంబర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన జాన్ ప్రకాష్ (22) అనే యువకుడు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పెద్దపల్లి పట్టణం క్రిస్టియన్ కాలనీకి చెందిన వల్లెపు జాన్ ప్రకాష్‌తోపాటు వరుసకు సోదరుడైన కరుణాకర్‌లు డిగ్రీ పరీక్షలు రాయడానికి ఉదయం ఏడున్నర గంటలకు బైక్‌పై పెద్దపల్లి నుంచి బయలుదేరారు. సుల్తానాబాద్‌లో కొయ్యడ భాను అనే మరో మిత్రుడిని బైక్‌పై ఎక్కించుకుని ముగ్గురు కరీంనగర్ వెళ్తుండగా దుబ్బపల్లి వద్ద యూటర్న్ తీసుకుంటున్న లారీని ఢీకొన్నారు. ఈ సంఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడగా వీరిని ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. వీరిలో జాన్‌ప్రకాష్ బైక్ నడుపుతుండగా తీవ్ర గాయాలపాలయ్యాడని, హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ గురువారం మరణించాడని ఎస్‌ఐ శ్రావణ్‌కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మహిళ అంబటి అమృత(52) ప్రమాదానికి గురై కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 25న మృతిచెందింది. ఆమె రెండో కూతురు స్రవంతి అమెరికాలో ఉండడంతో అంత్యక్రియలు నిర్వహించకుండా వేచిచూడాల్సి వచ్చింది. గురువారం కూతురు స్వగ్రామానికి చేరుకోవడంతో అమృత అంత్యక్రియలను నిర్వహించారు. మృతురాలికి భర్త రాజేందర్, కూతుర్లు సుమతి, స్రవంతి, మానసలు ఉన్నారు.

ప్రమాదానికి కారకుడైన ట్రాక్టర్ డ్రైవర్‌కు జైలు శిక్ష

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యంగా ట్రాక్టర్ నడిపి ఒకరి మృతికి కారణమైన డ్రైవర్‌కు 20 నెలల జైలుశిక్ష, 4 వేల జరిమానా విధిస్తూ గురువారం గోదావరిఖని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నల్లాల వెంకట సచిన్‌రెడ్డి తీర్పునిచ్చారు. 2016 నవంబరు 19న అల్లూరు సబ్‌స్టేషన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో రామగిరి మండలం లద్నాపూర్ గ్రామానికి చెందిన పొన్నంగౌడ్(48) అనే గీత కార్మికుడు మృతి చెందాడు. పొన్నంగౌడ్ భార్య పద్మతో కలిసి ద్విచక్ర వాహనంపై బొక్కలగుట్టకు వెళ్లి తిరిగి వస్తుండగా అల్లూరు సమీపంలో భీమగోని విద్యాసాగర్ వేగంగా ట్రాక్టర్ నడిపి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. మృతుడి బావమరిది పులిబాపు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గోదావరిఖని టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి తీర్పునిచ్చారు. పోలీస్ సిబ్బందిని రామగుండం సీపీ శ్రీనివాస్, డీసీపీ చేతన, ఏసీపీ మడక రమేష్ అభినందించారు.

చెరువులో పడి పశువుల కాపరి మృతి

బీర్‌పూర్,ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): పశువులను మేపడానికి వెళ్లి ప్రమాదవశాత్తూ అరగుండాల ప్రాజెక్టులో పడి పశువులు కాపరి మృతి చెందినట్లు ఏఎస్సై రవీందర్ గురువారం తెలిపారు. ఏఎస్సై రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. బీర్‌పూర్ మండలంలోని తుంగూర్ గ్రామానికి చెందిన ఉయ్యాల రాజయ్య(60) అనే పశువుల కాపరికి ఎవరూ లేకపోవడంతో తన సోదరుడి వద్ద ఉంటూ పశువులను కాస్తూ జీవిస్తున్నాడు. బుధవారం ఉదయం 6 గంటలకు ఇంటి నుంచి పశువులను మేపడానికి వెళ్లిన రాజయ్య సాయంత్రమైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో తన తమ్ముడు చంద్రయ్య తన కుమారుడు ఉదయ్ కలిసి బుధవారం రాత్రి, గురువారం గాలించగా మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో అరగుండాల ప్రాజెక్టులో మృతదేహం కనిపించింది. ఈత రాక మృతిచెంది ఉంటాడని రాజయ్య సోదరుడు చంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

యూరియా కోసం ఇబ్బందులు

● గొల్లపల్లిలో గోదాంలోకి చొచ్చుకెళ్లేందుకు యత్నం ● ఆలూరులో బారులు తీరిన రైతులు ● పైడిమడుగులో కొరతతో ఆందోళన

గొల్లపల్లి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలంలో యూరి యా కోసం గురువారం రైతులు ఆందోళన చేశారు. గొల్లపల్లి సింగిల్‌విండో కార్యాలయంలోకి చొచ్చుకెళ్లేందుకు పలువురు రైతులు యత్నించడంతో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు, జిల్లా వ్యవసాయ అధికారి సంఘటనా స్థలానికి చేరుకొని రైతులకు నచ్చజెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది. గురువారం సింగిల్‌విండో కార్యాలయానికి 350 యూరియా బస్తాలు వచ్చాయనే సమాచారంతో రైతులు పెద్దఎత్తున తరలివచ్చారు. దీంతో కొంత మంది రైతులకు టోకెన్లు అందజేశారు. టోకెన్లు అందని రైతులు యూరియా కావాలంటూ ఒక్కసారిగా గోదాంలోకి దూసుకు పోయేందుకు ప్రయత్నించారు. సమయం దాటాక ఇచ్చే యూరియా మాకెందుకు అంటూ పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఎస్సై చిర్ర సతీష్ కుమార్ సంఘటనాస్థలికి వచ్చి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. జిల్లా వ్యవసాయ అధికారి రాంచంద్రం అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రైతులకు సరిపడా యూరియాను అందించేందుకు ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పడంతో రైతులు శాంతించారు. అనంతరం టోకెన్లు పొందిన రైతులకు యూరియా బస్తాలను పంపిణీ చేశారు. సింగిల్‌విండో సీఈవో బెజ్జెంకి రాంసుధాకర్‌రావు మాట్లాడుతూ ఐదు లారీల లోడ్‌లకు డబ్బులు చెల్లించామన్నారు. రెండు లారీల యూరియా పంపించారని, దీంతో రైతులు పెద్దఎత్తున రావడంతో కొంత గందరగోళం ఏర్పడిందన్నారు. టోకెన్ ప్రకారం ఒక్కో రైతుకు రెండేసి బస్తాల చొప్పున అందజేశామన్నారు.

● **రాయికల్:** మండలంలోని ఆలూరు గ్రామంలో యూరియా కోసం రైతులు బారులు తీరారు. గ్రామంలోని సహకార కేంద్రంలో రైతులకు సరిపడా ఎరువులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు స్థానిక రైతులు తెలిపారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో రైతులు వారి ఆధార్ కార్డులు, పాస్ బుక్‌లను క్యూలైన్‌లో పెట్టి వేచి చూస్తున్నారు. ప్రభుత్వం కావాల్సిన ఎరువులను సరఫరా చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.



గొల్లపల్లి సింగిల్ విండో వద్ద రైతులు



పైడిమడుగులో బారులు తీరిన రైతులు, క్యూలో చెప్పులు



పైడిమడుగులో లైనులో ఉంచిన పాస్‌బుక్కులు

● **కోరుట్ల రూరల్:** మండలంలోని పైడిమడుగు గ్రామంలోని సహకార సంఘ భవనం వద్ద యూరియా కోసం రైతులు బారులు తీరారు. చెప్పులు క్యూలో పెట్టుకున్న రైతులు యూరియా కొరకు ఎదురు చూశారు. సింగిల్ విండో కార్యాలయం వద్ద గురువారం ఉదయం రైతులు భారీగా చేరుకున్నారు. యూరియా పంపిణీ చేస్తున్న సయమంలో కేంద్రం వద్ద రైతులు భారీగా చేరడంతో సందడిగా మారింది. సుమారు 400 బ్యాగులు రైతులకు అవసరం ఉండంగా 125 బ్యాగులు రావడంలో ఆవేదన వ్యక్తం చేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో కిరాణ షాపు దగ్ధం

రూ. 8 లక్షల నగదు, రూ. 30 లక్షల సామగ్రి ఆహుతి

మంథని రూరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంజపడుగులో గురువారం తెల్లవారుజామున శివశంకర్ కిరాణం, అండ్ జనరల్ స్టోర్‌లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. గ్రామానికి చెందిన ఊదరి శంకర్ కిరాణ దుకాణంలో మంటలు చెలరేగి నగదుతో పాటు షాపులోని సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. బుధవారం శంకర్ షాపు మూసివేసి పక్కనే ఉన్న మరో ఇంట్లో కుటుంబ సభ్యులతో నివసిస్తున్నారు. తెల్లవారుజామున 3 గంటల సమయంలో షాపులో మంటలు చెలరేగడంతో స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. మంథని ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు హుటాహుటిన తరలివచ్చి మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో ఇంటి మరమ్మతు కోసం అప్పుగా తెచ్చుకున్న రూ.7.80 లక్షల నగదుతోపాటు కౌంటర్‌లో ఉన్న రూ.30 వేలు దగ్ధమైనట్లు బాధితుడు శంకర్ తెలిపారు. సామగ్రి పూర్తిగా దగ్ధమై రూ.30 లక్షల వరకు నష్ట వాటిల్లినట్లు అంచనా వేస్తున్నారు. బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శించారు. బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.



అగ్నిప్రమాదంలో దగ్ధమైన దుకాణాన్ని పరిశీలిస్తున్న పుట్ట మధు

పాము కాటుతో రైతు మృతి

చొప్పదండి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాగంపేట పరిధిలోని బీరంరాజయ్యపల్లికి చెందిన రైతు ఎర్రం మల్లారెడ్డి(44) గురువారం పాముకాటుతో మృతిచెందాడు. రేవెల్లి శివారులో తన పొలంలో మల్లారెడ్డి పనిచేస్తుండగా పాము కాటు వేసింది. వెంటనే అతన్ని మొదట చొప్పదండి పీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడ నుంచి కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మల్లారెడ్డి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనూష తెలిపారు.

ఇసుక డంప్‌ని పట్టుకున్న పోలీసులు

● ఐదుగురిపై కేసు నమోదు, వాహనాలు సీజ్



ఇసుక డంప్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ఓదెల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంపుల శివారు నుంచి ఇసుక అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న లారీని, డంప్ చేసిన ఇసుకను పొత్కపల్లి ఎస్‌ఐ దీకొండ రమేష్ బుధవారం రాత్రి పట్టుకున్నారు. పెద్దిరెడ్డి జనార్దన్ రెడ్డి, మణిదీప్, పొన్నగంటి సురేష్, కోరి భాస్కర్, రాజన్ కుమార్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, గుంపుల పెట్రోల్ బంక్ పక్కన గల రైస్‌మిల్లు స్థలంలో అనుమతులు లేకుండా ఇసుక నిల్వ చేశారన్నారు. హైదరాబాద్‌కు తరలించడానికి లారీలో ఇసుక లోడ్ చేస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. నిలువ చేసిన దాదాపు 20 ట్రాక్టర్ల ఇసుకపై తహసీల్దార్‌కు సమాచారం ఇచ్చామని, కొందరు నేరస్తులు ఊక, ఇసుకను కలిపి కంటైనర్ లారీలో తరలిస్తుండగా పట్టుకొన్నామన్నారు.

ఎలాంటి అనుమతులు లేకుండా, ఎవరైనా ఇసుకను అక్రమంగా నిలువ చేసినా, తరలిం చినా చర్యలు తీసుకొంటామని ఎస్‌ఐ రమేష్ హెచ్చరించారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇసుక అక్రమ రవాణాపై ఎప్పటికప్పుడు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

బోల్తా పడిన లారీ.. తప్పిన ప్రమాదం

శంకరపట్నం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడికల్ శివారులో అదుపు తప్పి ఉనుక లారీ బోల్తాపడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కేశవపట్నం వైపు నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న ఉనుక లారీ అదుపుతప్పి గురువారం బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని స్థానికులు తెలిపారు.

అద్దె భవనంలో అంగన్‌వాడీ కేంద్రం

● పట్టించుకోని అధికారులు ● సౌకర్యాలు లేక చిన్నారుల అవస్థలు



ఎల్లారెడ్డిపేటలో నిరుపయోగంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రం

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక దశలోని చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలనే లక్ష్యంతో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రం-6 అద్దె భవనంలో కొనసాగుతోంది. ఇరుకైన గదులు, గాలి, వెలుతురు లేక ఉక్కపోత నడుమ చిన్నారులకు అవస్థమయంగా మారింది. చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు పడుతున్న ఇబ్బందులను తీర్చేందుకు మండల కేంద్రంలో రెండేళ్ల క్రితం నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం అసంపూర్తిగా నిలిచిపోయింది. పనులను చేపట్టిన గుత్తేదారు పూర్తి స్థాయిలో చేయకపోవడం వల్ల వినియోగంలోకి రాకుండా పోయింది. తలుపులు తెరచి ఉండడంతో అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారుతోంది. మద్యం దుకాణానికి సమీపంలోనే అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ కేంద్ర భవనంలో మందుబాబులు నిత్యం మద్యం సేవిస్తున్నారు. ఖాళీ మద్యం సీసాలను అక్కడే పడేస్తున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు తమకెందుకులే అన్నట్లు వ్యవహరిస్తుండడంతో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన భవనం నిరుపయోగంగా మారింది. ఆటపాటలతో కళకళలాడాల్సిన కేంద్రం ఖాళీ మద్యం సీసాలతో దర్శనమిస్తోంది. పనులను పూర్తి చేయించాల్సిన అధికారులు అటు వైపు కన్నెత్తి చూడకపోవడంపై చిన్నారుల తల్లిదండ్రులు, గర్భిణీలు, బాలింతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కేంద్రానికి నిధులు మంజూరు చేసిన పర్యవేక్షణ లేక అసంపూర్తిగా మిగిలిపోయిందని వాపోతున్నారు. కేంద్ర భవనంలో అసాంఘీక కార్యకలాపాలు సాగుతున్న పోలీసులు దృష్టి సారించకపోవడం ఏమిటనీ ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి కేంద్రం భవన నిర్మాణ పనులను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకు వచ్చి అద్దె భవనంలో కొనసాగుతున్న కేంద్రాన్ని స్వంత భవనంలోకి మార్చాలని కోరుతున్నారు.

ఎన్నికల తర్వాత పనులు పూర్తి చేయిస్తాం

- లక్ష్మీరాజం, జిల్లా సంక్షేమ శాఖ అధికారి



ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-6 భవనం అద్దె గదిలో కొనసాగుతోంది. యేడాది కిందట మంజూరైన నిధులతో పనులను ప్రారంభించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికల అనంతరం పనులను పూర్తి చేయిస్తాం. చిన్నారులకు వినియోగంలోకి తీసుకు వచ్చేలా చర్యలు చేపడుతాం.

అలంకారప్రాయంగా రైతు వేదికలు

● ఊరికి దూరంగా.. మందుబాబులకు అడ్డాగా

● నిరుపయోగంగా మారుతున్న కేంద్రాలు

పాలకుర్తి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): లక్షలు వెచ్చించి నిర్మించిన రైతు వేదికలు అలంకార ప్రాయంగా మారాయి. మరుగుదొడ్లు నిర్మించినా నీటి సౌకర్యం లేక అలంకారప్రాయంగా మిగిలాయి. ఊరికి దూరంగా నిర్మించడంతో కొన్ని రైతు వేదికలు మందుబాబులకు అడ్డాలుగా మారుతున్నాయి. పాలకుర్తి మండలంలోని మూడు రైతువేదికల పరిస్థితిపై ప్రత్యేక కథనం.

బీఆర్ఎస్ ప్రభుత్వం లక్షలు వెచ్చించి రైతువేదికలను నిర్మించింది. వ్యవసాయశాఖ అధికారులు అందుబాటులో ఉండేందుకు, సమకాలీన సాగు అంశాలపై ఎప్పటికప్పుడు రైతులతో సమావేశమయ్యేందకు వీలుగా రైతువేదికలను ఏర్పాటుచేశారు. అయితే ఆ లక్ష్యం నెరవేరడం లేదు. ఎల్కలపల్లి, జయ్యారం, కుక్కలగూడూర్ పేరిట మండలంలో మూడు క్లస్టర్లు మంజూరయ్యాయి. జయ్యారం, ఎల్కలపల్లిలో ప్రభుత్వ స్థలం లేకపోవడంతో పుట్నూర్, పాలకుర్తిలో, కుక్కలగూడూర్‌లో రైతువేదికలు నిర్మించారు. మూడు రైతువేదికకు ప్రహరీ పూర్తి కాలేదు. గుత్తేదారులు నాసిరకంగా పనులు చేపట్టడంతో పగుళ్లు చూపుతున్నాయి. మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణం అసంపూర్తిగా ఉన్నాయి. మంచినీటి సౌకర్యం లేదు. కుర్చీలు, బల్లలు, బాత్‌రూమ్‌లు ఏర్పాటు చేశారు. కానీ నీటి వసతి కల్పించలేదు. గ్రామాలకు దూరంగా ఉండడంతో ఆయా పంచాయతీల పరిధిలోని రైతులు అక్కడకు వెళ్లడం లేదు. నిర్వహణ లేకపోవడంతో రాత్రి వేళల్లో మందుబాబులకు అడ్డాలుగా మారుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. సమావేశాలు నిర్వహించకపోవడంతో అవి నిరపయోగంగా మారాయి.



పాలకుర్తిలోని రైతు వేదిక

● మండలంలో వ్యవసాయశాఖ కార్యాలయానికి సొంత భవనం లేకపోవడంతో ఆ శాఖ అధికారులు రైతువేదికలో విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంతో మహిళా ఉద్యోగులతో పాటు మహిళా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వేదికల వద్ద మౌలిక వసతులు కల్పించాలని రైతులు కోరుతున్నారు.



పుట్నూర్ రైతు వేదిక వద్ద నిరపయోగంగా మరుగుదొడ్లు


రైతు వేదికల వద్ద మౌలిక వసతులు కల్పించాలి

బొడ్డు రాయమల్లు రైతు, కుక్కలగూడూర్

మండలంలో నిర్మించిన మూడు రైతువేదికల్లో కనీస సౌకర్యాలు కల్పించకుండా అప్పటి ప్రభుత్వం ప్రారంభించింది. గ్రామాలకు దూరంగా, కనీసం రోడ్డు సౌకర్యం కల్పించకుండానే రైతువేదికలు ప్రారంభించడంతో నిరుపయోగంగా మారాయి. తాగు నీటి సౌకర్యంతో పాటు రోడ్డు నిర్మాణం, మరుగుదొడ్లు ఏర్పాటు చేసి వాడుకలోకి తీసుకురావాలి.

వెళ్లొస్తాం రాజన్నా..

వచ్చే ఏడాది మళ్లీ వస్తాం..



- స్వగ్రామాలకు తిరుగుప్రయాణమైన రాజన్న భక్తులు
- పిల్లాపాపలు, పాడిపంటలను చల్లగా చూడాలని మొక్కులు
- ముగిసిన మూడు రోజుల రాజన్న మహాశివరాత్రి వేడుకలు

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): వెళ్లొస్తాం రాజన్నా.. పిల్లాపాపలు, పాడి పంటలను చల్లగా చూడు.. అందరని క్షేమంగా చూస్తే మళ్లీ వచ్చే ఏడాదికి మళ్లీ నీ సన్నిధికి వచ్చి జాగరణ ఉపవాస దీక్ష చేస్తామంటూ భక్తులు వేములవాడ నుంచి స్వగ్రామాలకు తిరుగు ప్రయాణమయ్యారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి క్షేత్రంలో మూడు రోజులపాటు నిర్వహించిన మహాశివరాత్రి జాతర విజయవంతంగా ముగిసింది. రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలతో పాటుగా పట్టణ పురవీధులు మూడు రోజులుగా రద్దీగా మారాయి. భక్తులు బుధవారం రాత్రి రాజన్న ఆలయ గుడి చెరువులోని పార్కింగ్ స్థలంలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన చలువ పందిళ్ల కింద ఎంతో నిష్టతో రాత్రంతా జాగరణ చేసి తెల్లవారి నైవేద్యం పెట్టి దీక్షను విరమించారు.



బద్ది పోచమ్మకు మొక్కులు..

జాగరణ అనంతరం భక్తులు మట్టి పాత్రల్లో నైవేద్యాన్ని వండుకుని డప్పు చప్పుళ్ల మధ్య శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా బద్ది పోచమ్మ అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ ఈవో వినోద్‌రెడ్డి అదనంగా క్యూలైన్‌లు ఏర్పాటు చేయడంతో త్వరగా అమ్మవారి ఆలయంలోకి ప్రవేశించారు. పట్నాలు వేసి ఒడిబియ్యం పోసి నైవేద్యం సమర్పించి తిరుగు ప్రయాణమయ్యారు.

బియ్యంతో నిండిపోయిన కోటి లింగాలు..

వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి దక్షిణం వైపున్న కోటి లింగాలకు భక్తులు ఒడి బియ్యం సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. అయితే మహాశివ రాత్రి జాతరకు లక్షల మంది జనం రావడంతో భక్తులు సమర్పించిన ఒడిబియ్యంతో విగ్రహాలు బియ్యంలో కూరుకు పోయాయి. ఆలయ సిబ్బంది ఎప్పటికప్పుడు బియ్యాన్ని తొలగించిన భారీగా తరలివచ్చిన భక్తుల తాకిడికి కోటి లింగాలు బియ్యంతో నిండిపోయి కనిపించాయి. కాగా రాజన్న ఆలయానికి దర్శనానికి వచ్చిన ఓ భక్తురాలు తన బంగారు చైన్ పోగొట్టుకోవడంతో పార్వతిపురం ధర్మశాలలోని పారిశుధ్య విభాగం సిబ్బందికి దొరకడంతో తిరిగి భక్తులకు అందజేశారు. నిజాయితీని చాటుకున్న సిబ్బందిని ఆలయ ఈవో వినోద్‌రెడ్డి అభినందించారు.

ధర్మగుండంలో తొలగించని వ్యర్థాలు..

మహాశివరాత్రి జాతరకు వచ్చిన భక్తులు బుధవారం రాత్రి రాజన్న ఆలయ ధర్మగుండంలో జాగరణ కోసం పండ్లు, పూలతో దీపాలను వెలిగించారు. గురువారం మధ్యాహ్నం వరకు వ్యర్థాలను సిబ్బంది తొలగించకపోవడంతో భక్తులు అసహనం వ్యక్తం చేశారు. అంతేకాకుం డా శివదీక్ష తీసుకున్న శివస్వాములు తాము ధరించిన దుస్తువులను రాజన్న ఆలయ ధర్మగుండంలో వదిలివెళ్లగా సిబ్బంది తొలగించక పోవడంతో అలాగే ఉండిపోయాయి.

శివమయమైన వేములవాడ క్షేత్రం..

రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి

వేములవాడ రాజరాజేశ్వర స్వామి క్షేత్రం బుధవారం శివమయంతో నిండిపోయింది. పట్టణ పురవీధులతో పాటు ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. రాజన్న క్షేత్రంలో నిర్వహించిన మహాశివరాత్రి జాతర ఎంతో వైభవోపేతంగా నిర్వహించడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు. సుమారుగా 2 లక్షల 55 వేలకు పైగా భక్తులు గురువారం మధ్యాహ్నం వరకు వచ్చినట్లు అంచనా వేస్తున్నాం. భక్తులకు ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో జాతరను విజయవంతం చేయడం సంతోషంగా ఉంది. జాతర విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించిన బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, స్థానిక శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్, అన్ని శాఖల అధికారులతో పాటుగా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులకు, రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులకు ప్రసాదం అందజేయడంతో ఎక్కడ లోటుపాట్లు లేకుండా సమర్థవంతంగా విధులు నిర్వర్తించిన ఏఈవో శ్రావన్‌కుమార్‌కు, ప్రొటోకాల్ ఏఈవో అశోక్, సూపరిండెంట్ శ్రీకాంతచారి, సీనియర్ అసిస్టెంట్ బొడుసు మహేష్ యాదవ్, ఎడ్ల శివసాయి, పురాణం వంశీ, జూనియర్ అసిస్టెంట్ సంహచారిలకు ప్రత్యేక ధన్యవాదాలు.



సరిపోని చలువ పందిళ్లు..

మహాశివరాత్రి జాతరకు అనుకున్న దానికంటే ఎక్కువ మంది తరలిరావడంతో భక్తుల కోసం ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు సరిపోలేదు. దీంతో భక్తులు గుడి చెరువులోని ఖాళీస్థలాల్లో వెంట తీసుకువచ్చిన పరదాలతో టెంట్‌లను ఏర్పాటు చేసుకుని విడిది చేశారు. మరికొంత మంది భక్తులు రాజన్న గుడి చెరువలో పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్స్‌ను సపోర్టు చేసుకుని పరదాలను కట్టుకుని ఎండతగలకుండా విడిది చేసి వంటలు చేసుకున్నారు.





స్వామివారి దర్శనానికి క్యూలో వెళుతున్న భక్తులు, వేములవాడ నుంచి తిరుగు ప్రయాణమవుతూ..

జూకంటికి కొలుకలూరి సాహితీ పురస్కారం ప్రదానం



అవార్డును ప్రదానం చేస్తున్న ఎమ్మెల్సీ వరప్రసాద్

సిరిసిల్ల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : కథా రచయిత, కవి, విమర్శకులు జూకంటి జగన్నాథంకు జాతీయస్థాయి కొలుకలూరి భగీరథ కవితా పురస్కారం-2025 ప్రదానం చేస్తూ ఘనంగా సన్మానించారు. బుధవారం రాత్రి హైదరాబాద్‌లో తెలుగు యూనివర్సిటీ ఎన్టీఆర్ కళా ప్రాంగణంలో కొలుకలూరి పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. సాహిత్య రంగంలో విశేషంగా కృషి చేస్తున్న జూకంటి జగన్నాథం రచించిన 'ఒక కప్పు ఛాయ్... నాలుగు మేసేజ్‌లు' కావ్య సంపుటికి కొలుకలూరి పురస్కారాన్ని ఎమ్మెల్సీ మాణిక్య వరప్రసాద్, ద్రావిడ విశ్వవిద్యాలయం పూర్వ వైస్‌ఛాన్సలర్ మధుజ్యోతి, సుమ కిరణ్‌లు పురస్కారాన్ని అందించి సత్కరించారు.

జాతీయస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్‌కు తల్లీకూతుళ్ల ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్ ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లాకు చెందిన తల్లీకూతళ్లు మేరి స్టెల్లా, షీలాస్మృతి జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్‌కు ఎంపికయ్యారు. సికింద్రాబాద్ లోని జింఖానా మైదానంలో బుధవారం మాస్టర్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్స్ పోటీల్లో 50 ఏళ్ల పై వయస్సు విభాగంలో తల్లి మేరి స్టెల్లా జావెలిన్ త్రో, షాట్‌పుట్‌లో స్వర్ణ పతకాలు, 100 మీటర్ల పరుగుపందెంలో రజతం సాధించింది. కూతురు షీలాస్మృతి 30 ఏళ్ల పై వయస్సు విభాగంలో 100 మీటర్ల పరుగు పందెంలో రజతం, 200 మీటర్ల పరుగు పం దెంలో కాంస్యం సాధించింది. ఏప్రిల్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌లో పాల్గొననున్నారు. రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి రామారావు, రూబెన్‌మార్క్, సుధీర్, దేవదానం, డేనియల్, సుదర్శనం, జాన్సన్ అభినందనలు తెలిపారు.




ప్రశంస పత్రాలు అందుకుంటున్న తల్లీకూతుళ్లు మేరి స్టెల్లా, షీలాస్మృతి

పరిశోధన ఫలాలు సమాజానికి

నేడు జాతీయ సైన్స్ దినోత్సవం

గణేశ్‌నగర్,ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన శాస్త్రం మన జీవితాల్లో వెలుగులు నింపుతోంది. సీవీ రామన్ ఫిబ్రవరి 28, 1928న రామన్ ఎఫెక్ట్‌ను కనుగొని భౌతిక శాస్త్రంలో సరికొత్త అధ్యయనానికి నాంది పలికారు. ఆ ఆవిష్కరణకు గుర్తుగా ఫిబ్రవరి 28ను 1986 నుంచి జాతీయ సైన్స్ దినోత్సవంగా జరుపుకుంటున్నాము. ప్రతి సంవత్సరం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఒక నిర్దిష్ట అంశం (థీమ్), కొత్త ఆవిష్కరణ లేదా సాంకేతికత ఆధారంగా జరుపుకుంటారు. ఈ సంవత్సరం 'వికసిత్ భారత్‌కీ సైన్స్ ఆవిష్కరణల్లో ప్రపంచ నాయకత్వం కోసం భారతీయ యువతకు సాధికారత' అనే అంశంపై జరుపుకుంటున్నారు. ప్రస్తుతం మన దేశం సైంటిఫిక్ రీసెర్చ్ పబ్లికేషన్‌లో ప్రపంచవ్యాప్తంగా మొదటి ఐదు దేశాల్లో ఒకటిగా ఉంది. ఇన్నోవేషన్ ఇండెక్స్ 40వ స్థానంలో ఉంది. చంద్రుడి దక్షిణ ధ్రువం పైకి విజయవంతంగా చేరిన తొలి దేశంగా భారత్ నిలిచింది.



వ్యవసాయ రంగంలో నూతన ఆవిష్కరణలు

అన్నదాతలకు సహాయకారిగా ఉండేందుకు శాస్త్ర వేత్తలు ఎన్నో ఆవిష్కరిణలు చేస్తున్నారు. తక్కువ పరిమాణంలో ఉండే నానో యూరియాతో రైతులకు మేలు జరుగుతోంది. సమర్థవంతమైన నానా యూరి యా ఉంటూ పర్యావరణహితంగా సమర్థవంతమైన పాత్ర పోషిస్తుంది. పురుగుల మందులు పిచికారి చేసే డ్రోన్లు అందుబాటులోకి వచ్చాయి. దీంతో రైతు లకు డబ్బులు, సమయం ఆదా అవుతోంది.

విద్యారంగంలో...

కొవిడ్ సమయంలో ఆన్‌లైన్‌లో పాఠాలు కొత్త అధ్యాయనాన్ని ప్రారంభిం చాయి. ఈ విధానంతో ప్ర పంచవ్యాప్తం గా ఉన్న విషయాలను తెలుసుకునే అవకాశం కలిగింది. వర్చువల్ రియాలిటీ, డిజిటల్ బోర్డులు మొదలైన పరికరాల ద్వారా విద్యార్థులు కొత్త విషయాలు తెలుసుకుంటున్నారు.

పర్యావరణ పరిరక్షణ

పెరుగుతున్నకాలుష్యం, వాతావరణ మార్పులు, సహజ వనరుల క్షీణత వంటి సమస్యలు మన భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నాయి. నేపథ్యంలో శాస్త్రవేత్తలు పర్యావరణ పరిరక్షణ కోసం నిరంతరం నూతన ఆవిష్కరణలకై పరిశోధనలు చేస్తూనే ఉన్నారు ప్లాస్టిక్ కాలుష్యం ప్రపంచవ్యాప్తం గా తీవ్ర సమస్యగా మారింది. శాస్త్రవేత్తలు ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైకిల్ చేయడానికి కొత్త పద్ధతులు కను గొంటున్నారు. జలసౌర, పవన విద్యుత్ పునరుత్పాద క ఇంధన వనరులు వినియోగం పెరుగుతుంది.

రవాణా రంగంలో..

వేగవంతమైన, సురక్షితమైన పర్యావరణ అనుకూ లమైన రవాణా వ్యవస్థల కోసం శాస్త్రవేత్తలు నిరంతరం పరిశోధనలు చేస్తూనే ఉన్నారు. పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడంలో ఎంతో కీలకంగా మారాయి. బ్యాటరీ టెక్నాలజీలో పురోగతి, చార్జింగ్ స్టేషన్ల విస్తరణతో ఎలక్ట్రికల్ వాహనాల వినియోగం పెరిగిం ది. ప్యానెల్స్ ద్వారా ద్వారా చార్జింగ్ సౌకర్యం, వైర్లెస్ చార్జింగ్ వంటివి అందు బాటులోకి వస్తున్నాయి. డ్రైవర్ లేని వాహనాలు రవాణా రంగంలో పెద్ద మార్పులు తెస్తున్నాయి.

కృత్రిమ మేధస్సు

ఆధునిక యుగంలో సాంకేతిక పరిజ్ఞానం శర వేగంగా అభివృద్ధి చెందుతుంది. ఈ అభివృద్ధిలో కృత్రి మ మేధసు ముఖ్యపాత్ర పోషిస్తున్నది.కృత్రిమ మేధ స్సు అనేది కంప్యూటర్, యంత్రాలు మానవుల వలె ఆలోచించి, నేర్చుకొని, సమస్యలను పరిష్కరించే సామర్థ్యాన్ని కలిగి ఉండే ఒక సాంకేతికత. ఇది వివిధ రంగాల్లో అనేక శాస్త్రీయ ఆవిష్కరణలకు దారి తీసిం ది. వైద్య రంగంలో కృత్రిమ మేధస్సు చాలా ఉప యోగపడుతోంది.

సైన్స్ మన జీవితంలో ఒక భాగం

డాక్టర్ తిరుపతి, వృక్షశాస్త్ర అధ్యాపకుడు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల కరీంనగర్



సైన్స్ మన జీవితంలో ఒక ముఖ్యమైన భాగం. ఇది మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి, సమస్యలను పరిష్కరిం చడానికి అదేవిధంగా కొత్త ఆవిష్కరణలు చేయడానికి సహాయపడుతుంది. జాతీయ సైన్స్ దినోత్సవం అనేది కేవలం ఒకరోజు కాదు, ఇది శాస్త్ర విజ్ఞానం పై మనకున్న నిబద్ధతకు ప్రతీక. భారతదేశం శాస్త్ర సాంకేతిక రంగాల్లో మరింత అభివృద్ధి సాధించ డానికి, యువతలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొం దించుకోవడానికి ఈ దినోత్సవం స్ఫూర్తినిస్తుంది.

శివపార్వతుల శోభాయాత్ర



కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పార్వతీ రాజరాజేశ్వరస్వామి కల్యాణోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం రాత్రి గోదావరిఖని కోదండ రామాలయం నుంచి శివపార్వతుల ఉత్సవవిగ్రహాల శోభాయాత్ర అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈవో, సిబ్బంది, ప్రధానఅర్చకుల అత్తైణ చంద్రశేఖర శర్మ ఆధ్వర్యంలో శోభాయాత్ర కొనసాగింది. కేరళ డప్పు చప్పుళ్లతో విద్యుత్ కాంతులతో హంసరథంలో కొనసాగిన యాత్ర విశేషంగా ఆకట్టుకుంది. భక్తులు ఉత్సవ విగ్రహాలను దర్శించుకున్నారు.

వేలాల మల్లన్నస్వామి జాతరకు తరలిన భక్తులు

మంథని, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలోని వేలాలలో కొలువై ఉన్న మల్లికార్జునస్వామి (మల్లన్న) జాతరకు మంథని ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో భక్తులు గురువారం తరలి వెళ్లారు. మంథని నియోజకవర్గంలోని వివిధ మండలాలు, గ్రామాలకు చెందిన భక్తులు వేలాలలో జరిగే మల్లన్నస్వామి జాతరకు ఆర్టీసి బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో వెళ్లారు. మహాశివరాత్రి సందర్భంగా వేలాలలో జరిగే మల్లన్నస్వామి జాతరకు ఈప్రాంతం నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వెళ్ళి మొక్కులు చెల్లించుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు, పట్నాలు, బోనాలు సమర్పిస్తారు.

చెన్నకేశవనాథ స్వామి రథోత్సవం



రాయికల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని శ్రీ చెన్నకేశవనాథ స్వామి ఆలయంలో స్వామివారి రథోత్సవం గురువారం కన్నుల పండువగా జరిగింది. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాల అనంతరం ఉత్సవ విగ్రహాలైన శివపార్వతులను రథంపై ఉంచి ఆలయం చుట్టూ ఐదుసార్లు తిప్పారు. రథాన్ని లాగడానికి భక్తులు పోటీ పడ్డారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

దుబ్బరాజన్న ఆలయంలో భక్తుల సందడి



దుబ్బరాజన్న ఆలయంలో భక్తుల రద్దీ


సారంగాపూర్, ఫిబ్రవరి, 27 (ఆంధ్రజ్యోతి): సారంగాపూర్ మండలంలోని దుబ్బరాజన్న క్షేత్రంలో గురువారం భక్తుల రద్దీ నెలకొంది. అర్చకులు స్వామి వారికి అన్నపూజ కార్యక్రమం నిర్వహించారు. మాజీ మంత్రి గొడిసెల రాజేశం, సినీ వ్యాపారవేత్త మానాల పుల్లయ్య, మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్, బాపురెడ్డిలు దర్శించుకున్నారు. శుక్రవారం స్వామి వారి రథోత్సవం నిర్వహిస్తారు.

ఘనంగా సాంబశివ రథోత్సవం



బుగ్గారం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): బుగ్గారం మండల కేంద్రంలోని సాంబశివ నాగేశ్వర దేవాలయంలో రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివ భక్తులు రథాన్ని పూలమాలలతో అలంకరించి శివ భక్తులు, మహిళలు, దీక్ష స్వాములు రథమును లాగారు. ఈ వేడుకల్లో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ వేడుకల్లో నాయకులు బాధినేని రాజేందర్, వేముల సుభాష్, గాలిపెల్లి మహేష్, ఆలయ కమిటీ చైర్మన్ మసర్థి రాజిరెడ్డి పాల్గొన్నారు.

ధర్మపురిలో..



ధర్మపురిలో అక్కపెల్లి రాజరాజేశ్వర స్వామి రథోత్సవం

ధర్మపురి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శ్రీ అక్కపెల్లి రాజరాజేశ్వరస్వామి, శ్రీ రామలింగేశ్వరస్వామి, నేరెళ్ల, జైనాలో శ్రీసాంబశివుడి రథోత్సవాలు గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయం శివ పార్వతుల ఉత్సవ మూర్తులను అక్కపెల్లి ఆలయం నుంచి గాంధీ చౌక్ మీదుగా నంది విగ్రహ చౌరస్తా వరకు ఊరేగించారు. శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివ పార్వతుల కల్యాణం జరిపారు. కార్యక్రమంలో వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్‌శర్మ, ఆలయ అర్చకులు ద్యావళ్ల విశ్వనాథశర్మ, జన్మంచి శ్రీనివాస్, బూస ప్రవీణ్ కుమార్, ద్యావళ్ల ప్రసన్న కుమార్, పర్వతగిరి ప్రశాంత్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సీపతి సత్యనారాయణ పాల్గొన్నారు.

పెగడపల్లిలో ..



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

పెగడపల్లి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండల కేంద్రంలోని స్వయంభూ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో గురువారం స్వామివారి రథోత్సవ వేడుకలు కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం శివదీక్షాపరులు, భక్తులచే స్వామి వారి గ్రామ సందర్శనం శోభాయాత్ర నిర్వహించారు. రుద్ర హవనం, జయాదులు, బలిప్రధానం, మహాపూర్ణాహుతి, అన్నపూజ నిర్వహించి 6 వేల మందికి జాల తిరుపతి రెడ్డి కుటుంబ సభ్యుల సహకారంతో భక్తులకు అన్న, ప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ ఒరుగల శ్రీనివాస్, గుండి రాజేశ్వర శర్మ, శ్రీనివాస్ శర్మ, వినయ్ శర్మ, రాఘవ శర్మ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హోరాహోరీగా సాగిన పోలింగ్

-ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు
-ఉత్సాహంగా ఓటేసిన మహిళలు, యువత



సారంగాపూర్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్



ఎమ్మెల్సీ ఓటింగ్ సరళిని పరిశీలించేందుకు వెళ్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్



మెట్‌పల్లి పోలింగ్ కేంద్రం వద్ద పార్టీ నాయకుల సందడి

కోరుట్ల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ హోరాహోరీగా సాగింది. కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళశాలలో నిర్వహించిన పట్టభద్రుల, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. పోలింగ్ కేంద్రాన్ని ఎస్పీ అశోక్ కుమార్ పరిశీలించి బందోబస్తు వివరాలను అడిగి తెలుసుకున్నారు. పట్టభద్రులు, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల కు ఐదు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు స్థానిక వైద్యులు స్వీతి అనూఫ్- అనూఫ్ రావులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టభద్రుల ఎన్నికలో 3806 మంది ఓటర్లకు గాను 2,656 మంది ఓటు వేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు 332 మంది ఉండగా 303 మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. కోరుట్ల రెవెన్యూ డివిజన్ అధికారి జీవాకర్ రెడ్డి పర్యవేక్షణలో ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించారు. కోరుట్ల సీఐ సురేష్ బాబ్ ఆధ్వర్యంలో బందోబస్తును నిర్వహించారు.

●మెట్‌పల్లి టౌన్: మెట్‌పల్లి పట్టణం, మెట్‌పల్లి మండలానికి గాను గ్రాడుయేట్లు ఓట్లు వేసేందుకు ఎన్నికల అధికారులు ఐదు కేంద్రాలను ఎర్పాటు చేశారు. పట్టభద్రుల, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు ఉదయం 8 గంటలకు ప్రారంభం కాగా ఓట్లు వేసేందుకు బారులు తీరారు. మెట్‌పల్లి డీఎస్పీ రాములు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు. పట్టభద్రులు 68 శాతం మంది, టీచర్లు 90 శాతం ఓటు హక్కును వినియోగించుకున్నట్లు అధికారులు తెలిపారు. ఎస్పీ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని 233 పోలింగ్ స్టేషన్‌లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. బీజేపి రాష్ట్ర నాయకులు డాక్టర్ రఘు, కరీంనగర్ మాజీ జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగరావు పోలింగ్ సరళిని పరిశీలించారు. కాగా పోలింగ్ కేంద్రానికి సమీపంలో పార్టీల నాయకులు ప్రచారం నిర్వహిస్తుండటంతో ఎస్ఐ కిరణ్‌కుమార్ నాయకులను అక్కడి నుంచి పంపించేశారు.

● ఇబ్రహీంపట్నం మండలంలో....

ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పోలింగ్ కేంద్రంను అధికారులు ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం గ్రాడ్యుయేట్స్ ఓట్లు 611 గాను 456 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలలో మొత్తం 21 మందికి 20 మంది టీచర్లు తమ ఓటు హక్కును వినియోగించుకన్నారు. పట్టభద్రులు 74.63 శాతం, టీచర్లు 95.23 శాతం ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

●ధర్మపురి: ధర్మపురిలో మూడు పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ నిర్వహించారు. ఈ ఎన్నికల్లో మండలంలో మొత్తం 1765 మంది పట్టభద్రులకు గాను 1232 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 69.8 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. అలాగే 135 మంది టీచర్లకు గాను 130 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 96.29 శాతం పోలింగ్ నమోదు అయింది. ఉదయం కొంత పోలింగ్ శాతం తగ్గి ఉండగా మధ్యాహ్నం తరువాత వేగంగా పుంజుకుంది. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పోలింగ్ కేంద్రం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులను, కార్యకర్తలను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కలిసి ఓటింగ్ వివరాలు అడిగి తెలుసు కున్నారు. పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ కృష్ణచైతన్య, మండల డిప్యూటీ తహసీల్దార్ మాజీద్ సందర్శించారు. ధర్మపురి ఎస్ఐ ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది భారీ బందో బస్తు నిర్వహించారు.

71 శాతం పోలింగ్ నమోదు

●పెగడపల్లి : పెగడపల్లి మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 1602 మంది పట్టబద్రుల ఓటర్లకు గాను 1142 మంది, 36 మంది ఉపాధ్యాయ ఓటర్లకు గాను 33 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నట్లు తహసీల్దార్ రవీందర్ తెలిపారు. మల్యాల సీఐ నీలం రవి ఆద్వర్యంలో పెగడపల్లి ఎస్ఐ సీహెచ్. రవికుమార్ పోలీస్ సిబ్బందితో గట్టి బందోబస్తు నిర్వహించారు.

పట్టభద్రులు 68.86 శాతం పోలింగ్

●వెల్గటూర్: వెల్గటూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాలలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం పూట పోలింగ్ మందకొడిగా సాగింది. మొదటి సారి ఎమ్మెల్సీ ఓటు హక్కు వినియోగించుకున్న యువతీ, యువకులు ఆనందం వ్యక్తం చేశారు. మండలంలో మొత్తం 896 పట్టభద్రులకు గాను 417 మంది యువకులు, 190 మంది యువతులు మొత్తం 617 మంది యువతీ, యువకులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 68.86 శాతం మంది పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. 9 మంది టీచర్లకు గాను ఆరుగురు టీచర్లు ఓటు హక్కు వినియోగించుకోవడంతో 66.66 శాతం ఓటింగ్ నమోదు అయింది. సీఐ రామ్ నర్సింహారెడ్డి, ఎస్సై ఉమాసాగర్ లు పోలీసు బందో బస్తు ఏర్పాటు చేశారు. తహశీల్దార్ శేఖర్, ఎంపీడీవో వెంకటేశ్వర్ రావు, ఆర్ఐ లు రాంరెడ్డి, రాజేశ్వరిలు ఎప్పటికప్పుడు పోలింగ్ సరళిని పరిశీలించారు.

●రాయికల్: రాయికల్ పట్టణంలోని పోలింగ్ కేంద్రాన్ని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పరిశీలించి పోలింగ్ శాతాన్ని తెలుసుకున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలింగ్ స్టేషన్‌లో మాజీ జడ్పీటీసీ జాదవ్ అశ్విని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు ముదుగంటి రవీందర్‌రెడ్డి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

●గొల్లపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం గ్రాడ్యుయేట్ ఓటర్లు 1437 మంది కాగా, 969 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 69.43 శాతం ఓటింగ్ నమోదైంది. టీచర్ ఓటర్లు మొత్తం 12 మంది ఉండగా వంద శాతం ఓటింగ్ నమోదైనట్లు తహసీల్దార్ వరందన్ తెలిపారు. పోలింగ్ సందర్భంగా ఒక పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లకు కనీస వసతులు కల్పించలేదని ఓటర్లు ఆరోపించారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పోలింగ్ కేంద్రం వద్దకు వచ్చి పార్టీ నాయకులను పోలింగ్ సరళిపై ఆరా తీశారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి డా. సుంకిశాని రాజసుమన్ రావు పోలింగ్ కేంద్రం వద్ద పోలింగ్ సరళిని పరిశీలించారు. బీజేపీ నాయకులు కన్నం అంజయ్య పోలింగ్ కేంద్రం వద్దకు వచ్చి తమ పార్టీ అభ్యర్థి ఓటింగ్ సరళి గూర్చి తమ పార్టీ నాయకులను అడిగి తెలుసుకున్నారు. ఎస్సై చిర్ర సతీష్ కుమార్ ఆద్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ఒకే కుటుంబం నుంచి నలుగురు

భీమారం: ఒకే కుటుంబం నుంచి నలుగురు గ్రాడ్యుయేట్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలోని రంగాపూర్ గ్రామానికి చెందిన ఒద్దినేని మల్హాల్‌రావు, అతని భార్య శ్రీమతి, కుమారుడు రామకృష్ణారావు, కూతురు హిమబిందు రావులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

మండలంలో 68.99 శాతం పోలింగ్

●కొడిమ్యాల: మండలంలో 68.99 శాతం ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నట్లు సెక్టార్ అధికారి మునీందర్ తెలిపారు. కొడిమ్యాల మండలంలో 2122మంది పట్టభద్రుల ఓట్లు, 35 మంది ఉపాధ్యాయుల ఓట్లు ఉండగా, 1464 మంది పట్టభద్రులు, 35 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 8గంటలకు ఎన్నికల సెక్టార్ ఆఫీసర్ మునీందర్, కొడిమ్యాల తహసీల్దార్ రమేష్, కొడిమ్యాల ఎస్సై సందీప్ పోలింగ్ కేంద్రాలకు ఓటర్లను అనుమతించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఎస్పీ అభ్యర్థి ప్రసన్నహరికృష్ణ పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటింగ్ సరళిని పరిశీలించారు. కొడిమ్యాల ఎస్సై సందీప్ బందోబస్తు నిర్వహించారు.

●మల్యాల: మల్యాలలో జరుగగా 69.37శాతం పట్టభద్రులు, 89.18శాతం ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులు యాదగిరి శేఖర్‌రావు, ప్రసన్న హరికృష్ణ పోలింగ్ సరళిని పరిశీలించారు. ఓటు హక్కు వినియోగించుకోవడానికి గర్భిణులు, బాలింతలు ఉత్సాహం చూపారు. సెక్టోరియల్ అధికారి, తహసీల్దార్ మునీంధర్, రూట్ అధికారి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తిరుపతి, సీఐ నీలం రవి, ఎస్సై నరేశ్ పర్యవేక్షించారు. పోలింగ్‌కు ఒక రోజు ముందు ఓ అభ్యర్థి మద్దతుదారులు వెయ్యి రూపాయల చొప్పున ఓటర్లకు పంపిణీ చేశారనే పలువురు ఆరోపించారు. కొన్ని చోట్ల సొమ్ము తగ్గించారని ఓటర్లు బహిరంగంగానే నిలదీశారు.

●బుగ్గారం: మండల కేంద్రంలో ఒకటి ఎన్నికల పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. మొత్తం 481 గ్రాడ్యుయేట్ ఓటర్లకు గాను 348 మంది ఓటును వినియోగించుకున్నారు. మొత్తం టీచర్స్ 13 ఓటర్లకు గాను 13 మంది ఓటును ఓటును వినియోగించుకున్నారు.

●రాయికల్: రాయికల్ మండల కేంద్రంలో గురువారం జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. 2175 పట్టభద్రుల ఓటర్లకుగాను 1577 మంది ఓటు హక్కును వినియోగించుకోగా, 72.50 శాతం పోలింగ్ నమోదైంది. 66 మంది టీచర్లకుగాను 66 మంది ఓటు హక్కు వినియోగించి 100 శాతం పోలింగ్ నమోదైంది.

●బీర్‌పూర్: మండలంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్ ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో పట్టభద్రులు 595 మంది ఓటర్లు ఉండగా 437 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉపాధ్యాయ ఓటర్లు 25 మంది ఉండగా 24 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టభద్రులల ఓటింగ్ 73.45 శాతం కాగా ఉపాధ్యాయుల ఓటింగ్ 96 శాతం అయినట్లు సెక్టరల్ అధికారి ముంతాజుబ్దిన్ తెలిపారు. ఓటింగ్ సరళిని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పరిశీలించారు. సీఐ కృష్ణరెడ్డి, ఎస్సై కుమార స్వామి బందోబస్తు నిర్వహించారు.



పెగడపల్లిలో వికలాంగుడిని ఓటు వేసేందుకు వీల్‌చైర్‌లో తీసుకెళ్తున్న సిబ్బంది

●సారంగాపూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఎస్పీ అశోక్ కుమార్ సందర్శించారు. పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహిస్తున్న అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో ఎస్బీ సీఐ ఆరీఫ్ అలీకాన్, టౌన్ సీఐ వేణుగోపాల్, రూరల్ సీఐ కృష్ణరెడ్డిలు ఉన్నారు. పోలింగ్ సరళిని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పరిశీలించారు.

●సారంగాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 203 బూత్‌లో పట్టుభద్రుల ఓటు వేసే వద్ద కిటికీ మూసి ఉంచడంతో చీకటి నెలకొంది. దీంతో ఓటర్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో కిటికీ తెరవడంతో ఓటు వేశారు.

●భీమారం: మండల కేంద్రంలో ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పట్టభద్రుల ఓటర్లలో 449 మంది ఓట్లు ఉండగా, 335 ఓట్లు పోలయ్యాయి. 216 మంది పురుష ఓటర్లు, 119 మంది మహిళా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 74.61 శాతం పోలింగ్ నమోదైంది. 9 మంది టీచర్లకుగాను 9 మంది ఓటు హక్కు వినియోగించి 100 శాతం పోలింగ్ నమోదైంది.

●కథలాపూర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానం కోసం జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. కోరుట్ల ఎస్సై రాంచంద్రం ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. మండలంలో 863 పట్టభద్రుల ఓటర్లకుగాను 631 ఓట్లు పోలయ్యాయి. ఇందులో 399 పురుషులు, 232 మహిళలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. టీచర్స్ స్థానంకుగాను 23 మంది ఓటర్లకు 20 మంది ఓటు వేశారు. 13 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించు కున్నారని ప్రిసైడింగ్ అధికారి మహమ్మద్ ఫైజాన్ తెలిపారు. 73 శాతం పోలింగ్ జరిగింది.

●మల్లాపూర్: మండల కేంద్రంలో గురువారం ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతంగా మగిసంది. ఉపాధ్యాయ ఓట్లు మండలంలో 19 ఉండగా అందరు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టభద్రుల ఓట్లు 1039ఉండగా 778 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

●మేడిపల్లి: పట్టభద్రుల, ఉపాధ్యాయుల శాసన మండలి ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. పట్టభద్రులు 752 మందికి గాను 604 మంది, ఉపాధ్యాయులు 26 మందికి గాను 25 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

●ఎండపల్లి: మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఎండపల్లి మండల కేంద్రంలో మూడు బూత్‌లు ఏర్పాటు చేశారు. మొత్తం గ్రాడ్యుయేట్ 1185 ఓట్లకు గాను 809 ఓట్లు పోలయ్యాయి. టీచర్స్ ఎమ్మెల్సీ ఓట్లు 21కి గాను అందరూ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పోలింగ్ కేంద్రం వద్దకు వచ్చి కార్యకర్తలకు పలు సూచనలు చేశారు.



గొల్లపల్లిలో క్యూలైన్‌లో వేచి ఉన్న ఓటర్లు



కొడిమ్యాలలో బారులు తీరిన ఓటర్లు



బీర్‌పూర్‌లో ఓటర్ల క్యూ

శివపార్వతుల కల్యాణం

కొడిమ్యాల, ఫిబ్రవరి27(ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెప్యాల గ్రామ శివారులోని చెరువు కట్టపై ఉన్న శివాలయంలో శివరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని గురువారం శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. ఉదయం నుండి భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. సుమారు 2000 మందికి ఆలయ కమిటీ వారు భక్తులకు అన్నదానం చేశారు.

ప్రార్థనలకు స్థలం కేటాయించాలి

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ప్రార్థనలు చేసుకోవడానికి స్థలం కేటాయించాలని కోరుతూ నూకపెల్లి అర్బన్ హౌజింగ్ కాలనీ ముస్లీం మైనార్టీ లబ్ధిదారులు గురువారం జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ మేరకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే స్థలం ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి గెలుపు ఖాయం

-ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి

జగిత్యాల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నరేందర్ రెడ్డి గెలుపు ఖాయంగా కనిపిస్తోందని పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకున్న సందర్భంగా కొద్దిసేపు మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కరీంనగర్, మెదక్, నిజామబాద్, అదిలాబాద్ ఎమ్మెల్సీ స్థానాన్ని తిరిగి కైవసం చేసుకుంటుందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పోలింగ్ సరళిని పరిశీలిస్తే కాంగ్రెస్ గెలుపు ఖాయమని తెలుస్తుందన్నారు.

ఎడ్ల బండ్ల పోటీలు

వెల్గటూర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలం లోని వెంకటాపూర్‌లో గురువారం ఎడ్ల బండ్ల పోటీలు హోరా హోరీగా నిర్వహించారు. మహా శివరాత్రి సందర్భంగా స్వయంభు కట్ట రాజేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎడ్ల బండ్ల పోటీలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

జడ్పీ మాజీ చైర్‌పర్సన్ పూజలు

జగిత్యాలరూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి):జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస పౌలస్తేశ్వరస్వామి ఆలయంలో గురువారం మాజీ జడ్పీచైర్‌పర్సన్ దావవసంతసురేష్ దంపతులు పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో శివుడికి అభిషేకం నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. వారి వెంట బీఆర్ఎస్ రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు ఆనందరావు, కమలాకర్‌రావు, ప్రవీణ్‌గౌడ్, సాయిలక్ష్మీ, సులోచన, తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఎదగాలి

రాయికల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధితో ఆర్థిక స్వావలంబన లభిస్తుందని ఎంజీఐఆర్ఐ ప్రతినిధులు అన్నారు. మండలంలోని జగన్నాథ్‌పూర్ గ్రామంలోని మురళీధర గోదాంలో గోమయ ఉత్పత్తుల తయారీ, స్వయం ఉపాధిలో అవకాశాలపై శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టర్ చెన్నమనేని పద్మ, ఎంజీఐఆర్ఐ ప్రతినిధులు ప్రశాంత్, సందీప్ జోషి, జయ కిషోర్ సంగని, మహేష్, మధుకర్, మాజీ సర్పంచులు డాక్టర్ తురగ రాజరెడ్డి, కోల శ్రీను పాల్గొన్నారు.

అగ్రికల్చర్ కళాశాలను సందర్శించిన ఎమ్మెల్యే

కోరుట్ల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రాంతంలోని బిఎస్సీ అగ్రికల్చర్ కళాశాలను గురువారం కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ సందర్శించారు. కళాశాలను సందర్శించిన ఎమ్మెల్యే స్థానికంగా ఉన్న సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ విద్యార్థులతో మాట్లాడి సమస్య పరిష్కారం కృషి చేస్తామని తెలిపారు.

'రాష్ట్రంలో బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కు'

కథలాపూర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో బీఆర్ఎస్, బీజేపీలు కుమ్మక్కయ్యాయని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆరోపించారు. శ్రీశైలం ఎడమ గట్టు సొరంగంలో జరిగిన దురదృష్టకరమైన ఘటనను మాజీ మంత్రి కేటీఆర్ రాజకీయం చేసి చూడడం దారుణమని ఆయన అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఎమ్మెల్సీ పోలింగ్ సరళిని పరిశీలించి స్థానిక నాయకులను గెలుపు అవకాశాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సొరంగంలో పనులు జరుగుతున్న సమయంలో అనూహ్యంగా మట్టిపెళ్ళలు కూలిపోవడంతో 8 మంది చిక్కుకున్న పరిస్థితిని మానవీయ కోణంలో చూడాలని అన్నారు. క్షేమంగా బయటకు తీసుకురావడానికి తీవ్రంగా ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుంటే రాజకీయంగా బురద జల్లేందుకు బీఆర్ఎస్ చూడడం సిగ్గుచేటని ఆరోపించారు. కార్యక్రమలో పీసీసీ కార్యవర్గ సభ్యుడు తొట్ల అంజయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి, చెదలు సత్యనారాయణ, రేహాన్, జవ్వాజి రవి, గడ్డం స్వామిరెడ్డి, మోహన్ తదితరులు ఉన్నారు.

'డబుల్ బెడ్‌రూం ఇళ్లకు మౌలిక వసతుల కల్పన'



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణ పేదల కోసం నూకపెల్లి అర్బన్ హౌజింగ్ కాలనీలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లకు పది రోజుల్లో మౌలిక వసతులు కల్పిస్తానని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ తెలిపారు. నూకపెల్లి అర్బన్ హౌజింగ్ కాలనీకి వెళ్లిన ఎమ్మెల్యే అక్కడి అభివృద్ధి పనులను పరిశీలించారు. వేగవంతంగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రూ.40 కోట్ల వరకు బిల్లులు రాక పెండింగ్‌లో ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ముఖ్యమంత్రిని కలిసి డబుల్ బెడ్ రూంల విషయమై వివరించగానే నిధులు మంజూరుకు హామీ ఇచ్చి కలిసి పని చేద్దామని ఆహ్వానించారని అన్నారు. పేద ప్రజల కష్టాలలో భాగం పంచుకోవడానికి రాజకీయాల్లోకి వచ్చానని, వారికి సేవ చేయాలనే లక్ష్యంతోనే పార్టీ మారడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్లు కూతురు రాజేష్, కూసరి అనిల్, పంబాల రామ్ కుమార్, పిట్ట ధర్మరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అడువాల లక్ష్మణ్, క్యాదాసు నాగయ్య, బద్దం జగన్మోహన్ రెడ్డి, వద్ది రామ్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సంగెం గ్రామంలో గురువారం బోనాల జాతర ఘనంగా సాగింది. దేవాలయంలో పోత రాజు ప్రత్యేక పూజలను నిర్వహిం చారు. గ్రామానికి చెందిన మహిళలు బోనాలను నెత్తిన పెట్టుకోని శోభయాత్ర నిర్వహించారు. శోభయాత్రలో పోతరాజుల నృత్యాలు అలరింపజేశాయి. మహిళలు బోనా లను అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

కథలాపూర్: మండలంలోని సిరికొండలో గురువారం బద్ది పోచమ్మ బోనాల జాతర ఘనంగా జరిగింది. మహిళలు గ్రామ శివారులో ఉన్న బద్ది పోచమ్మకు డప్పు చప్పుళ్ళతో వెళ్ళి బోనాలతో నైవేద్యాలు అందించారు. అనంతరం పోచమ్మకు సాంప్రాదాయ ప్రకారం యాటను బలిచ్చారు. పోతరాజుల విన్యాసాలు అలరించాయి.

బోనాల జాతర

కథలాపూర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూషణరావుపేటలో గురవారం దుర్గామాత బోనాల జాతర ఘనంగా జరిగింది. ఆలయంను గ్రామ శివారులో కొత్తగా గ్రామస్థులు నిర్మించగా ఇటీవల విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు జరిగాయి. ఇంటి కొకరు చొప్పున దుర్గామాతకు బోనాలు తీసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. పురవీధుల వెంట బోనా లతో అమ్మవారి ఆలయం దాకా చప్పుళ్ళతో వెళ్ళారు. పోతరాజులు చేసిన వివిధ రకాల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.